భగ్గుమంటున్న భానుడు



- నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బ ముప్పు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



పెద్దవడుగూరు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి శుక్రవారం వడదెబ్బ నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసబాబు

బుక్కరాయసముద్రం: భానుడు భగ్గుమంటున్నాడు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఎండా కాలంలో ప్రజలు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ సోకే ప్రమాదముంది. వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా వైద్యాధికారులు పలు సలహాలిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 40–42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయన్నారు. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్, (శరీరంలో నీటి శాతం తగ్గడం) , డయేరియా (విరేచనాలు), వడదెబ్బ తదితర సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. వడదెబ్బకు ప్రాథమికంగా నీరే ప్రాణాధారమన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేవారు ఎండ నుంచి రక్షణ పొందడానికి గొడుగు లేదా టోపీ లేదా తలపై గుడ్డ వేసుకోవాలని, తగినంత నీరు, చల్లని పానీయాలు తీసుకుంటూ ఉండాలన్నారు. శరీరాన్ని చల్లబరచుకోవడానికి ప్రజలు చెరుకు రసం, కొబ్బరినీళ్ల తదితర పానీయాలతో పాటు కళింగర, దోస, తదితర పండ్లు తినాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎండలో పని చేయొద్దు

ప్రజలు వేసవి కాలంలో ఎండలో పని చేయకుండా ఉండడం మంచిది. ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, ఒల్లు నొప్పులు వస్తాయి. అదే విధంగా ఒక్కొక్కసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడ దెబ్బకు గురైన బాధితులను శీతల ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరానికి నీటి తడి గుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.

ప్రథమ చికిత్స ఇలా..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి. ఐస్ నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి. శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజు, ద్రావణం తాగించాలి. రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి

జాగ్రత్తగా ఉండాలి



వేసవి కాలంలో ప్రజలు సాధమైనంత వరకూ బయటకు తిరగరాదు. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, తాగడం మంచిది. వృద్ధులు, చిన్నారులు కార్మికులు ఎండ ప్రభావానికి దూరంగా ఉండాలి. కూల్ డ్రింక్స్ తాగకూడదు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్లరసాలు తీసుకోవడం మంచిది. అలాగే కాటన్ దుస్తులు ధరించాలి.

– డాక్టర్ స్వాతి లక్ష్మి, బుక్కరాయసముద్రం

ఎండలో తిరగొద్దు



వైద్యాధికారి ప్రవీణ్ కుమార్

గుత్తి రూరల్: వేసవిలో ఎండలు మండుతూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ వడగాల్పులు అధికమై ప్రజలు బయటకు రావాలంటేనే హడలెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో వడదెబ్బతో అస్వస్థతకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వైద్యాధికారి మాట్లాడారు

సాక్షి: వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

వైద్యుడు: ఎక్కువ సమయం ఎండలో తిరగకూడదు

సాక్షి: వడదెబ్బ లక్షణాలు ఎలా ఉంటాయి?

వైద్యుడు: వడదెబ్బ సోకిన వారికి జ్వరం 100 డిగ్రీలకు పైగా ఉంటుంది. అలసట, వాంతులతో నీరసించి పోతారు. విరేచనాలు ఎక్కువగా అవుతాయి

సాక్షి: వడదెబ్బకు గురైన వారికి ఎలాంటి చికిత్సలు అందించాలి?

వైద్యుడు: వడదెబ్బకు గురైన వారిని గాలి తగిలే ప్రాంతంలో పడుకోబెట్టాలి. తడి గుడ్డతో వేడి తగ్గే వరకు తుడవాలి. వడదెబ్బ సోకిన వారికి అతి శీతల పానీయాలు తాగించరాదు.

సాక్షి: వడదెబ్బకు నివారణ చర్యలు ఏమిటి?

వైద్యుడు: వ్యవసాయ, ఉపాధి పనులు చేసే కూలీలు ఎక్కువ సేపు ఎండలో పనిచేయకుండా నీడలో గాలి తగిలే చోట విశ్రాంతి తీసుకోవాలి.

పెండింగ్ 'ఉపాధి' బిల్లులు చెల్లించండి



గుంతకల్లు మండలం నెలగొండ సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం



శింగనమలలో ఏపీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

గుంతకల్లు రూరల్: రెండు నెలలుగా బిల్లులు ఇవ్వకపోతే ఉపాధి కూలీలు ఏం తినాలి, ఎలా బతకాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం మండలంలోని నెలగొండ గ్రామంలో ఉపాధి పనులు పరిశీలించిన ఆయన కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయం ఎదుట జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులతో కలిసి ధర్నా నిర్వహించారు. రెండు నెలలుగా ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. చేసిన పనులకు వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా నడుస్తాయన్న ఆలోచన కూడా ప్రభుత్వాలకు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఉగాది పండుగ లోపు కూలీలకు వేతనాలు అందించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బీ.శ్రీనివాసులు, మారుతీ ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించండి

శింగనమల: 10 వారాలవుతున్న ఉపాధి బిల్లులు మంజూరు చేయలేదని , వెంటనే కూలీలకు బిల్లులు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మికులు శుక్రవారం ఏపీఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కూలీలకు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరారు. పనుల వద్ద కనీస సౌకర్యాలు, తాగు నీరు, టెంటు, మెడికల్ కిట్లు , మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. సమ్మర్ అలెవెన్స్ పెంచాలన్నారు. ప్రతి ఒక్కరికీ 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. పెరిగిన నిత్యవసర సరుకులను దృష్టిలో పెట్టుకుని రోజుకు రూ.600 కూలి అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు సూర్యప్రకాష, సుంకన్న, రామాంజనేయులు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించండి

పెద్దవడుగూరు: అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి దస్తగిరి, జిల్లా కమిటీ సభ్యుడు ఈశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని చిన్నవడుగూరు, దిమ్మగుడి, చిట్టూరు గ్రామాల్లోని ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ బిల్లులు త్వరగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మీ మాటే ముఖ్యం' ప్రారంభం



మహిళతో మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్

తాడిపత్రిటౌన్ (యాడికి): యాడికి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో మీ మాటే ముఖ్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 10 మంది బాధితులు హాజరై సమస్యలు విన్నవించారు. దంపతులు, అత్తాకోడళ్ల మధ్య నెలకొన్న మనస్పర్థలు కారణంగా నెలకొన్న సమస్యలపై దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. సమస్యలు పరిష్కరిస్తామని ఏఎస్పీ హామీ ఇచ్చారు. అనంతరం యాడికి మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ఈరన్న, సిబ్బంది శివ, శివకుమార్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి కృషి



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు కుళ్లాయప్పను సన్మానిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: అనంతపురం డివిజనల్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు లోలూరు కుళ్లాయప్ప అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయనను దళిత సంఘాల నాయకులు ఘనం గా సన్మానించారు.ఈ సందర్భంగా కుళ్లాయప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కదిరెప్ప, ఆదెన్న, ఓబులపతి, రామాంజనేయులు, మల్లికార్జున, మునెయ్య, నాగేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపవాస ఆరాధన

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో క్రీస్తు శ్రమల దినాల స్మరణలో భాగంగా శుక్రవార సాయంకాల ఉపవాస ధ్యాన ఆరాధనను ఘనంగా నిర్వహించారు. దైవదాసులు పీవీఎస్ రాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆరాధనలో టీచర్ మెర్సీ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు శిలువలో తన రక్తం చిందించి మనల్ని పాపముక్తులను గావించడానికి ఈ లోకానికి వచ్చాడన్నారు. శిలువలో పడిన ఆయన బాధలను స్మరించుకుంటూ భస్మ బుధవారం నుంచి గుడ్ ఫ్రైడే, ఆ తర్వాత శనివారం వరకూ క్రైస్తవులు 40 రోజుల ఉపవాస దినాలు ఆచరిస్తానన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జకరయ్య, అబ్రహాం, పీసీ రత్నరాజు, బుజ్జిబాబు, రాజు, దేవదాసు, ప్రసాద్, రజని, టీచర్ ప్రిస్కిల్లా, శాంతమ్మ, సుశీలమ్మ, లత, రమాదేవి, జ్యోతి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: పామిడ పెన్నానది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులకు గుంతకల్లు వైపు వెళ్తూ మండలంలోని పీ కొండాపురం గ్రామం వద్ద ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



గేట్స్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎండీ రఘునాథ్ రెడ్డి

గుత్తి: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ ఎండీ రఘునాథ్ రెడ్డి అన్నారు. గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కాలేజీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ముఖ్యమన్నారు. విద్యార్థులందరూ చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని ఆకాంక్షించారు. ఇండోర్, అవుట్ డోర్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కాలేజీ వార్షికోత్సవం రోజు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీ జోయెల్, నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గుత్తి: మున్సిపాలిటీ వ్యాప్తంగా అన్ని వార్డుల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, పరిష్కరించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ మాట్లాడారు. పబ్లిక్ కొళాయిలకు 20 రోజులకు ఒకసారి కూడా నీరు సరఫరా చేయడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రేణుక, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

శింగనమల: శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 293 మందికి గాను 293 మంది హాజరుకాగా, కేజీబీవీలో 140 మందికి గాను 139 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 130 మందికి 130 మంది హాజరయ్యారన్నారు.

యల్లనూరు: చిలమకూరు మోడల్ స్కూల్లో పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షల తీరును డీఓ మహేశ్వరర్‌రెడ్డి, చీఫ్ అధికారిణి పంకజం మేరీ లీలా పర్యవేక్షించారు. 305 మంది పరీక్షలకు హాజరు కావాల్సిఉండగా 297 మంది పరీక్షలు రాశారు.

పామిడి: పామిడిలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతం జరిగింది. టీసీహెచ్‌లో 280 మందికి 280 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఎస్–1, ఎస్ఎస్‌వీఎం–4, ప్రభుత్వ జూనియర్ కళాశాల–2 చొప్పున ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు చీఫ్‌లుగా శ్రీనివాస్, హరినాథ్, మహాలక్ష్మి, విశ్వనాథ్ కాగా, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా వెంకటనాయుడు, శివప్రసాద్‌నాయుడు, రాఘవేంద్ర, మధుకర్ వ్యవహరించారు. సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని బీకేఎస్ జెడ్పీ హైస్కూల్, అనంత విద్యానికేతన్ పాఠశాల, ఆర్డీటీ బధిరుల పాఠశాల కేంద్రాల్లో ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించగా తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓలు నవీద, లింగానాయక్ తెలిపారు.

గార్లదిన్నె: గార్లదిన్నె, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్లో 609 మంది విద్యార్థులకు గాను 600 మంది పదో తరగతి పరీక్షకు హాజయ్యారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని ఎంఈఓ చంద్రనాయక్ తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: పరిమితికి మించి ఆటోలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ నారాయణనాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆటోలకు సూచికల పత్రాలను అతికించారు. మద్యం సేవించి ఆటోలను నడిపినా, ప్రమాదాలకు కారకులైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. లగేజీ ఆటోల్లో ప్రయాణీలను తరలించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జమేదారు ఓబుళపతి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు వద్ద ఉన్న 23వ సచివాలయాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికతో పాటు రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దని సూచించారు. అంతకుముందు ఆయన 60 అడుగుల రోడ్, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ రామాంజనేయరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: మండల పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా రామాంజనేయరెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నాడు. గత ఫిబ్రవరిలో సాక్షి పత్రికలో ఎస్ఐని నియమించరూ అన్న కథనానికి స్పందించిన జిల్లా ఎస్పీ జగదీష్ ఎట్టకేలకు ఎస్ఐని నియమించారు. గతంలో ఎస్ఐ రామిరెడ్డి వీఆర్ నుంచి యల్లనూరుకు బదిలీపై వచ్చారు. ఏం జరిగిందో ఏమో ఒక్క రోజులోనే ఆయనను వెంటనే వీఆర్‌కు పంపారు. నంద్యాల జిల్లాలో పని చేస్తున్న రామాంజనేయరెడ్డిని యల్లనూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన పోలీస్ సిబ్బందితో సమావేశమై....మండల ప్రస్తుత పరిస్థితులు, ఫ్యాక్షన్ గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతామని ఎస్ఐ తెలిపారు.

అడవులతో మానవ మనుగడ



మొక్క నాటుతున్న ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గుత్తి రూరల్: అడవులను సంరక్షించుకోవడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ అడవులు అంతరించి పోతున్నాయని, తద్వారా వర్షాలు తగ్గి కరువు వస్తోందన్నారు. అనంతరం వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, కాశీరావు, కోటేశ్వరరావు, హరినాథ్, తేజేశ్వర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ



అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్ర వారం అంగన్‌వాడీ సిబ్బందికి పోషణ్‌బీ పడాయ్‌బీ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ ఉమాశంకరమ్మ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.అనంతరం ప్రీ స్కూల్ పిల్లల కార్యకలాపాల నిర్వహణలో మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ జ్యోతి, వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ అరెస్టు



నిందితున్ని చూపుతున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: మండలంలోని బందార్లపల్లి గ్రామంలో జరిగిన దొంగతనానికి సంబంధించి 24 గంటలు గడవక మునుపే దొంగను అరెస్టు చేసి 6.2తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. షేక్ హనీఫ్ సమీప బంధువు చనిపోవడంతో ఇంటికి తాళం వేసి వెళ్లారన్నారు. అదే గ్రామానికి చెందిన చిన్న బాషా తాళం పగులకొట్టి ఇంటిలోకి వెళ్లి బంగారం వస్తువులను దొంగలించాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

యల్లనూరు: మండల కేంద్రంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ వాహనంపై వేంకటేశ్వర స్వామిని ఊరేగించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. శనివారం కల్యాణోత్సవం, ఆదివారం రథోత్సవం ఉంటుందని ప్రధాన అర్చకుడు విజయ రాఘవన్ తెలిపారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తాం

పుట్లూరు: మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఏఓ కాత్యాయని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రబీలో పప్పుశనగ సాగు చేసిన రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. క్వింటాల్ రూ.5,650 ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

పుట్లూరు: గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలను వేస్తున్నట్లు పశువైద్య సహాయకులు రామచంద్ర తెలిపారు. శుక్రవారం మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాల్లో పాడి పశువులకు టీకాలు వేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఈ కార్యక్రమం ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైనట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

25న మండల సమావేశం

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బాచుపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యకిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్ సూచించారు. మండలంలోని బాచుపల్లిలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని జంగాల కాలనీలో జ్వరాలు వ్యాపించడంతో నివారణ చర్యలు చేపట్టారు. కాలనీలో వైద్య శిబిరం నిర్వహించి సుమారు 350 మందికి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూగృహాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల ముందు మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆంజనేయులు, కళావతి, సునీత, లక్ష్మీప్రసన్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరుల పోరాట ఫలితంగానే 'వర్గీకరణ బిల్లు'

గుంతకల్లుటౌన్/పామిడి: ఎమ్మార్పీఎస్ నిర్వహించిన సుదీర్ఘ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టసభల్లో ఆమోదం లభించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్ అన్నారు. ఏపీ అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు పాస్ కావడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ కార్యదర్శి జన్నే మస్తానయ్య, ఉపాధ్యక్షుడు జయరామ్, నాయకులు రాజేష్, సుమంత్, మాతయ్య, డేనియల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కే లాలెప్ప మాదిగ ఆధ్వర్యంలో మాదిగలు సంబరాలు చేసుకున్నారు.